**మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

**బీసీ కమిషనరేట్ కార్యాలయంలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 151 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 28 మే 2026


# పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం**

**ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్న రేవంత్**




**హైదరాబాద్,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన మిగతా2లో...

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

**జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు**

**కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు**

**మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని

మిగతా2లో...






# డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

**- ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జన్నార్**

**హైదరాబాద్,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బక్రీద్ పండుగ నేపథ్యంలో.. డిజిటల్ చెల్లింపుల విషయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఇటీవల కాంచన్‌బాగ్, రాజేంద్రనగర్ పీఎస్‌ల పరిధుల్లో రెండు డిజిటల్ మోసాలు వెలుగులోకి వచ్చాయని సీపీ తెలిపారు. కాంచన్‌బాగ్‌లో ఆరుగురు వ్యక్తులు ఒక వ్యాపారితో బేరమాడి, రూ.5వేలు చెల్లించినట్లుగా చూపించే నకిలీ యాప్ స్క్రీన్‌ను చూపించి రూ.68వేల విలువైన పశువులతో ఉడాయించారని తెలిపారు.అదేవిధంగా, రాజేంద్రనగర్‌లో నలుగురు వ్యక్తులు రూ.48వేల విలువైన మేకలను కొనుగోలు మిగతా2లో...

# కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

**- వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు**



**కాళేశ్వరం,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కరఘాట్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరించారు. వేద మంత్రోచ్ఛరణలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 21న ప్రారంభం అయిన పుష్కరాల్లో భక్తులు వివిధ ప్రాంతాల న ఉంచి వచ్చి నదీ స్నానం ఆరిస్తున్నారు. ఈ పుష్కర పుణ్య స్నానాలకు తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. హంపి మిగతా2లో...



# గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నేతల ఘర్షణ

**హైదరాబాద్ మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశంలో రసాభాస చోటు చేసుకుంది. గాంధీ భవన్‌లో మంత్రులు అజహరుద్దీన్, పొన్నం ప్రభాకర్ ముందే కాంగ్రెస్ నేతలు చొక్కాలు పట్టుకొని ఘర్షణ పడ్డారు. అజహరుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ మధ్య ఈ గొడవ జరిగింది. ఉస్మాన్ అల్ హజ్రీ తోసేయడంతో ఫిరోజ్‌ఖాన్ కిందపడ్డారు. వీహెచ్‌ను కూడా తోసేందుకు యత్నించగా నేతలు అడ్డుకున్నారు. ఈక్రమంలో అజహరుద్దీన్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

# పంటల కొనుగోలు లేక దీనావస్థ

● వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి ● బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి ● పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు



**హైదరాబాద్,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని మిగతా2లో...

# పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం

● సంస్కరణలకు,విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం నాంది ● టిడిపి పుట్టుక, ప్రయాణం ప్రస్థానం అన్నీ అద్భుతాలే.. ● దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ టిడిపి ● మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తాం ● 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం ● మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ● ఈ మహానాడు మహిళలకు అంకితం ఇస్తున్నాం ● 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ● మహానాడు మోడల్ మారింది తప్ప..విధానం మారలే

● వైసిపి హయాంలో అణచివేతలను ఎదుర్కొని నిలబడ్డాం ● మహానాడు ప్రారంభోపన్యాసంలో టిడిపి అధినేత చంద్రబాబు



**అమరావతి,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం పార్టీ నాంది అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్థానం అన్ని అద్భుతాలేనని... ప్రతి అడుగు సంచలనమేనని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. 1875 క్లస్టర్‌ల వేదికగా ఈసారి మహానాడు జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్షలాదిమంది కార్యకర్తలు తొలిరోజే అదరగొట్టారని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధవాతావరణం మూలంగా మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 'సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు' అని 44 ఏళ్ల క్రితం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనను టీడీపీ పరిచయం చేసిందని ప్రస్తావించారు. జెండర్ ఈ క్వాలిటీ, సామాజిక సమస్యలపై తెలుగుదేశం పోరాడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసమని చంద్రబాబు అన్నారు. రెండ్రోజుల పాటు జరిగే మహానాడు ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్‌కు నాంది తెలుగుదేశమని తెలిపారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ మిగతా2లో...

# కర్నాటకలో మారుతున్న సమీకరణాలు

సిద్ధరామయ్యను తప్పుకోవాలని అధిష్టానం సూచన

నేడు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం

30న డికె శివకుమార్ ప్రమాణం చేస్తారన్న ప్రచారం

సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపాలని అధిష్టానం నిర్ణయం







- సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌కు తరలింపు

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించ లేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యానం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి హాజరై పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి, పుష్కరాల ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గురిం చి వివరించారు. అలాగే దేవాదాయ కమిషనర్ హనుమంతరావు హాజరై పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పుష్కరాల సందర్భంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రాసస్థం దుర్గ సూక్త హోమం అత్యంత వైభవంగా జరిగింది. పండితులు వేద మంత్రాల నడుమ హోమ క్రతువులను నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు.

ఆర్టీసీ సంస్థ సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్‌ను చూసి మురిసిపో యిన భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సరస్వతి పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే పిల్లలు ఆడు కోవడానికి ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిల్లాపాపలతో వచ్చిన భక్తులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. అలాగే అంత్య పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మంగళ, గురువారాల్లో కాల సర్ప దోశ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పుష్కరాల నేపథ్యంలో ఆ పూజలను తాత్కలికంగా నిలిపివేశారు. పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ముక్తీశ్వరుడిని దర్శించుకుని వెళ్లారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రతి రోజూ శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వ హించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని పునీతులవుతారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కల్యాణాన్ని నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందిస్తున్నారు.

# పంటల కొనుగోలు లేక దీనావస్థ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురి సిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవు తోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయి లోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్ర తినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శిం చాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

తెదేపా అని కొనియాడారు. జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరినీచిన ఏకైక ప్రాంతీయ పార్టీ మనదని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తామని ధీమా వ్యక్తంచేశారు.కూడు, గూడు నీడ లాంటి సంక్షేమ విధానాలతో తెదేపా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం చేస్తూనే ఉందన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా ప్రజా పోరాటాలు ఆపలేదని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తు న్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. మహిళల వంటింటి కష్టాలు తగ్గేందుకు నాడు గ్యాస్ కనెక్షన్ ఉచితంగా ఇచ్చాం. నేడు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఆడబిడ్డలకు ఆర్థిక, సామాజిక గౌరవమిస్తున్నాం. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించాం. తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాం. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని నిరూపించాం. గంజాయి, డ్రగ్స్‌పై అత్యంత కఠినంగా ఉన్నాం. సోషల్ సైకోల తాటతీసి. మహిళల గౌరవాన్ని కాపాడుతాం. నాడు ఒక్క ఐటీనే.. యువత తల రాత మార్చింది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయి. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని చెప్పాం. ఎంవోయూలన్నీ పూర్తయితే ఇది సాధ్యమే. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడాం. ఇప్పుడు గేర్ మార్చాం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడుతున్నాం. ఏ ప్రాజెక్టు వచ్చినా మాటల్లో



కాదు.. చేతల్లో చూపిస్తున్నాం. 288 ప్రాజెక్టులు ప్రారంభించే రోజు కూడా నిర్ణయించేశాం అని సీఎం తెలిపారు. వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ... కార్యకర్తల్లో జోరు మాత్రం తగ్గలేదని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహిస్తున్నా మని తెలిపారు. యుద్ధం వల్ల మహానాడును హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని వివరించారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహానాడు విధానం మారలేదని అన్నారు. భవిష్యత్తు గురించి అన్ని విషయాలు చర్చించుకుందామని తెలిపారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించిందని ప్రస్తావించారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి గౌరవం, ఆత్మవిశ్వాసమని ఉద్ఘాటించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, భరోసా కలుగుతోందని తెలిపారు. నాటికి, నేటికి టీడీపీపై ప్రజలకు ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పారు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం టీడీపీ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజా పోరాటాలు ఆపలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వైసీపీ హయాంలో నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం జెండాను వీడలేదు. చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా.. జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తోంది. అక్రమంగా నన్ను జైల్లో పెట్టారు, లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. మన నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేశారు. అయినా టీడీపీ వెనకడుగు వేయలేదు. ప్రజా స్వామ్యం కోసం టీడీపీ నిలిచిందని అంటూ వివరిం చారు. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాం. ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత అప్పగించారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నాం. మహిళా సాధికారిత, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం టీడీపీ పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి.. నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక ఉంటుంది. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. ఇది చూసే నా చిన్నప్పుడు ఇష్టంగా నడిపిన రాయల్ ఎన్‌ఫిల్డ్ కూడా రాష్ట్రానికి వచ్చింది. 1875 ప్రాంతాల్లో మహానాడు హైబ్రిడ్ సమావేశం జరుగుతోంది. ఏ తీర్మానానికి ఎంతమంది ఆమోదం తెలిపారో రియల్ టైంలో వస్తు న్నాయి. బెస్ట్ టెక్నాలజీ ప్లస్‌ని ఇక్కడికి తెస్తామని యువ తకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం పేర్కొన్నారు.

# పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

(మొదటి పేజీ తరువాయి)

ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

చేసి, నకిలీ పేమెంట్ యాప్‌తో బురిడీ కొట్టించారన్నారు. ఖాతాలో డబ్బు జమ కాలేదని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, మేకలు, గొర్రెల అమ్మకందారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులను అప్పగించే ముందు, మీ బ్యాంకింగ్ ఖాతాలో బ్యాలెన్స్ నిర్ధారించుకోవాలన్నారు. ఎవరైనా మోసం చేయడానికి ప్రయత్నిస్తే డయల్ 100కు కాల్ చేసి పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# కర్నాటకలో మారుతున్న సమీకరణాలు



న్యూఢిల్లీ,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :కర్నాటకం క్లైమాక్స్‌కు చేరినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం చురుగ్గా పావులు కదుపుతోంది. మే 30వ తేదీ శనివారంనాడు కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గు రు ఉపముఖ్యమంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఓబీసీ వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు. కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామా పత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేస్తారు. 'గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే' అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో కీలకమైన బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఆయన గురువారం ఉదయం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం.

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

## ● సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌కు తరలింపు

హైదరాబాద్,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) : పోక్స్ కేసులో నిందితుడు బండి భగీరథ్‌ను బుధవారం పేట్ బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం అతడిని మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలించారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం భగీరథ్‌ను పోలీసులు ఈ ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లినట్ల తెలుస్తోంది. మరోవైపు భగీరథ్‌ను మూడు రోజులపాటు ప్రశ్నించేందుకు పోలీసులకు కోర్టు అనుమతి ఇచ్చింది. పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. అతడిని కస్టడీకి కోరుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. బండి భగీరథ్‌ను మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది.దీంతో బండి భగీరథ్‌ను చంచల్‌గూడ జైలు నుంచి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. అతడిని మూడు రోజుల పాటు పోలీసులు విచారించనున్నారు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా.. ఆమెపై అత్యాచారం చేశాడనే ఆరోపణలు బండి భగీరథపై వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మే 16వ తేదీన అతడిని పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. బండి భగీరథ్ నుంచి మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని.. వారం రోజుల పాటు అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పోలీసులు స్పష్టం చేశారు. కానీ కోర్టు మాత్రం భగీరథ్‌ను మూడు రోజుల వరకే పోలీసుల కస్టడీకి అనుమతి ఇచ్చింది.

# ప్రధాని మోదీని కలిసిన తమిళనాడు సీఎం విజయ్.. 12 ఏళ్ల తర్వాత మోదీతో భేటీ



న్యూఢిల్లీ,మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :తమిళనాడు సీఎం పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా విజయ్ ప్రధాని మోదీని కలిశారు. న్యూఢిల్లీలోని సేవా తీర్థ్‌లో బుధవారం ప్రధాని మోదీతో సీఎం జోసెఫ్ విజయ్ భేటీ అయ్యారు. గతంలో 12 ఏళ్లక్రితం మోదీని విజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కానీ, ఈసారి విజయ్ సీఎం హోదాలో ప్రధానిని కలవడం విశేషం.మోదీ, విజయ్ ఈరోజు దాదాపు 25 నిమిషాలపాటు భేటీ అయినట్లు తెలుస్తోంది. మోదీతో భేటీ అనంతరం విజయ్.. న్యూఢిల్లీలోని తమిళనాడు హౌజ్‌కు చేరుకున్నారు. అక్కడ ఆయనకు అధికారిక స్వాగతం లభించింది. ఇది సీఎం హోదాలో విజయ్ మొదటి ఢిల్లీ పర్యటన. అక్కడ అధికారికంగా పర్యటిస్తున్న విజయ్ మొదటి పర్యటన కాబట్టి కేంద్రంలోని కీలక నేతలతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. తాజా సమాచారం ప్రకారం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ కానున్నారు.తమిళనాడుకు సంబంధించి కొన్ని అభ్యర్థనల్ని కూడా విజయ్.. ప్రధాని, కేంద్ర మంత్రులకు సమర్పించే అవకాశం ఉంది. అలాగే, తమిళనాడులో టీవీకే కూటమి ప్రభుత్వ ఏర్పాటులో సహకరించిన కాంగ్రెస్ పార్టీకి సంబంధించి.. ఆ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలతో కూడా భేటీ కానున్నారు. ఢిల్లీలోని జన్‌పథ్‌లో వీరితో సమావేశమయ్యే అవకాశం ఉంది.

# మున్సిపాలిటీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

## చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్
## కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ పరిశీలన




**కల్లూరు, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలనే లక్ష్యంతో కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులను క్షేత్రస్థాయిలో సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానంగా డ్రైనేజీల పరిస్థితి, చెత్త నిల్వలు, మురుగునీటి ప్రవాహం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పలు ప్రాంతాల్లో డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు, వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి నిల్వలు ఏర్పడకుండా, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సానిటరీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. వార్డు స్థాయిలో ప్రతిరోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని, డ్రైనేజీలలో చెత్త పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రజలు కూడా చెత్తను రోడ్లపై, డ్రైనేజీలలో వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యమే మున్సిపాలిటీకి ముఖ్యమని పేర్కొంటూ, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కల్లూరు మున్సిపాలిటీని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ తెలిపారు. ప్రజల సహకారంతో పారిశుధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్స్ యాస శ్రీకాంత్ నాగమణి, ఉబ్బన రాంబాబు , సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై సమీక్ష

## • రాజకీయ పార్టీలతో
## సబ్ కలెక్టర్ సమావేశం



**కల్లూరు, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా నిర్వహించే అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల వివరాలలో మార్పులు, సవరణలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అధికారులు వివరించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కోరారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి దశలో రాజకీయ పార్టీల సహకారం అవసరమని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను కాపాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజే శారు. సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## రైతులకు కొనుగోలు పత్రం ఇవ్వకపోతే
# సీఈఓలను సస్పెండ్ చేస్తాం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**చిట్యాల మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో తడిచిన ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూకొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు దాన్యం కొనుగోలు పత్రాలను కచ్చితంగా అందజేయాలని కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు కొనుగోలు పత్రాలు అందించకపోతే సంబంధిత సీఈఓ లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురి చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు అలాగేజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ధాన్యం తడవకుండా టార్పాలిన్లుతో కప్పి ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అవకతవకలు పాల్పడితే వ సస్పెండ్ చేస్తామని క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సివిల్ సప్లై అధికారి కిరణ్ కుమార్, జిల్లా కోపరేటివ్ అధికారి వాలియా నాయక్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి. మండల అధ్యక్షులు కూట్ల తిరుపతి. జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖిరాల మధు వంశీకృష్ణ. యూత్ మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవో, తహసీల్దార్ హామీతో విరమించిన రాస్తారోకో

## వడ్లు కొనుగోలు వేగవంతం
## చేయాలని రైతుల డిమాండ్





**రామడుగు మే 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలో వడ్లు కొనుగోలు కేంద్రాల వద్ద జరుగుతున్న జాప్యాలను నిరసిస్తూ రైతులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. వడ్లు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అనంతరం రైతుల సమస్యలను తెలుసుకుని ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు నాగి శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం వడ్లు కొనుగోలు విషయంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మండలంలోని దాదాపు 20 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ మందగించిందని, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. క్వింటాల్‌కు 9 కిలోలు కట్ చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రతి 40 కిలోల బస్తాపై లారీ యజమానులు రూ.2 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తూకాల్లో కూడా మోసాలు జరుగుతున్నాయని అన్నారు. లారీలు సమయానికి రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల కురిసిన వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోయిందన్నారు. మరోవైపు రైతులు నార్లు పోసి నాట్లు వేసుకునే సమయం దగ్గరపడుతున్నా కొనుగోళ్లు పూర్తికాకపోవడం రైతు వ్యతిరేక ప్రభుత్వానికి నిదర్శనమని విమర్శించారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి వడ్లు కొనుగోలు వేగవంతం చేయాలని, తూకాల్లో మోసాలు నివారించాలని, రైతుల నుంచి అదనపు వసూళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ద్వారా ఆర్డీవోతో మాట్లాడగా, మూడు నుంచి నాలుగు రోజుల్లో ధాన్యం పూర్తిగా సేకరించేందుకు 11 లారీలు పంపిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు. చివరగా ఎస్ఐ రాజు వడ్ల కొనుగోలు కేంద్రానికి చేరుకుని ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడి ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, మాజీ సర్పంచ్ పంజాల జగన్మోహన్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఒంటెల రమణారెడ్డి, లంక మల్లేశం, పర్లపల్లి మహేష్, కలిగేటి మునిందర్, మిల్కుల తిరుపతి, రైతులు గుర్రం నర్సింగం, బొమ్మరవేణి నర్సింగం, ముత్తయ్య, అంజయ్య, దండవేణి తిరుపతి, పెసరి రవి, సామంతుల నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కమిషనరేట్ కార్యాలయంలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సన్మానం





**హైదరాబాద్,మే 27(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని బీసీ కమిషనరేట్ కార్యాలయంలో ఇటీవల నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ అజయ్ కుమార్, వైస్ చైర్మన్ బంగారి బాబు లని తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల నాయకులు ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి శాలువాలతో సన్మానం చేసి పూలమొక్క అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల సమితి కో–కన్వీనర్ & ఉమ్మడి వరంగల్ జిల్లాల అధ్యక్షులు దురిశెట్టి చంద్రమౌళి (చందు), రజక సంఘం నాయకులు పెద్దాపురం కుమార్, కొన్నేం సంపత్ , సంగెం శ్రీనివాస్, బాలాపూర్ బలరాజ్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అజయ్ కుమార్, బంగారి బాబు లు బీసీ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

# పంట వ్యర్థాలను తగులబెట్టొద్దు: బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్



**మల్లంపల్లి మండల ప్రతినిధి మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యవసాయ పొలాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టే క్రమంలో రైతులు చేసే చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల పర్యావరణానికి ఎంతో నష్టం వాటిల్లుతోందని, ఈ అలవాటును రైతులు వెంటనే మానుకోవాలని లిబీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ గారులి హితవు పలికారు. పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల చుట్టుపక్కల ఉన్న ఎన్నో విలువైన వృక్షాలు అగ్నికి ఆహుతై పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా, కాలుష్యం పెరిగి భూగర్భ జలాలు అడుగంటిపోతాయని, ఎన్నో పక్షులు, జీవరాశులు తమ ఆశ్రయాన్ని కోల్పోయి ప్రాణాలు విడుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మంటల తీవ్రతకు భూమిలోని మిత్రపురుగులు చనిపోయి భూసారం పూర్తిగా దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు. రైతులు పొలాల్లోని వ్యర్థాలను తగులబెట్టే బదులు, వాటిని కంపోస్టింగ్ ద్వారా సహజ ఎరువుగా మార్చుకోవాలని, ఒకవేళ అత్యవసరంగా తగులబెట్టాల్సి వస్తే మంటలు పక్కన ఉన్న చెట్లకు లేదా ఇతర పొలాలకు వ్యాపించకుండా చుట్టూ రక్షణ గీతను ఏర్పాటు చేసుకుని, అవి పూర్తిగా ఆరిపోయే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించాలని జాగ్రత్తలు సూచించారు. ప్రకృతి ప్రసాదించిన వృక్ష సంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, నిర్లక్ష్యంగా వ్యవహరించి చెట్ల వినాశనానికి కారణమయ్యే వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్ గౌడ్ గారు డిమాండ్ చేశారు.


# ఆదర్శ దాంపత్యానికి ప్రతీకగా నిలిచిన ఆకుల వెంకటేశ్వర్లు సుజాత దంపతులు



**ఖమ్మం, ప్రతినిధి మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగరంలోని కవిరాజనగర్ 11వ డివిజన్ మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు శ్రీ ఆకుల వెంకటేశ్వర్లు సుజాతల 37వ వివాహ వార్షికోత్సవాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సంఘ నాయకుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, మిత్రులు, అభిమానులు దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మూడు దశాబ్దాలకు పైగా పరస్పర ప్రేమ, విశ్వాసం, అనురాగం, కుటుంబ విలువలను కాపాడుకుంటూ ఆదర్శ దాంపత్య జీవితం గడుపుతున్న వెంకటేశ్వర్లు సుజాత దంపతులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని పలువురు కొనియాడారు. కుటుంబ బంధాలకు ప్రాధాన్యతనిస్తూ, సామాజిక సేవలోనూ చురుకుగా పాల్గొంటూ మున్నూరు కాపు సంఘ ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి సందర్భంలోనూ సమాజానికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండే ఈ దంపతులు ఇలాగే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనందాలతో, ఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వారి దాంపత్య జీవితం మరింత సుఖశాంతులతో, కుటుంబ ఆనందాలతో కొనసాగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఢిల్లీ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ దళిత విభాగానికి చారిత్రాత్మక గుర్తింపు

## • రాహుల్ గాంధీ సమక్షంలో నియామక పత్రాల పంపిణీ
## • కవంపల్లి సత్యనారాయణకు ఏఐసీసీ పూర్తి మద్దతు



**ఉప్పల్, మే 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ దళిత విభాగం అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఢిల్లీలో దళిత విభాగ నాయకులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి హెచ్ ఆర్ మోహన్ తెలిపారు. తెలంగాణకు చెందిన జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ స్థాయి దళిత విభాగ నాయకులకు జాతీయ దళిత విభాగం అధ్యక్షుడు రాజేంద్రపాల్ గౌతమ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం రాహుల్ గాంధీ సమక్షంలో నిర్వహించడం రాష్ట్ర దళిత విభాగ నాయకుల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. దళిత నాయకత్వానికి గౌరవం, గుర్తింపు తీసుకొచ్చే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. రాష్ట్రంలో దళిత విభాగ బలోపేతానికి కవంపల్లి సత్యనారాయణ చేపడుతున్న కార్యక్రమాలకు ఏఐసీసీ పూర్తి మద్దతు ఉంటుందని రాజేంద్రప్రసాద్ గౌతమ్ స్పష్టం చేసినట్లు వెల్లడించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై అవసరమైతే సస్పెన్షన్ చర్యలు కూడా ఉంటాయని పేర్కొన్నట్లు తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి హెచ్ ఆర్ మోహన్ వెల్లడించారు.

# సామాజిక పెన్షన్ మంజూరు విధానంలో సాంకేతిక సమస్యలను సవరించండి...!

**● రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ నాయకుని విన్నపం**



**కరీంనగర్ టౌన్ మే 27(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత (పెన్షన్) పథకంలో వృద్ధ దంపతుల్లో ఒకరు మరణించిన సందర్భంలో తక్షణ సహాయం అందించే విధానంలో సాంకేతిక మార్పులు చేయవలసిందిగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం లెటర్ ద్వారా విన్నవించారు. రాష్ట్రం లో అమలు చేస్తున్న వివిధ రకాలైన సామాజిక పెన్షన్ లకు సంబంధించి, వృద్ధులు, విధవులు, వికలాంగులు మరియు ఇతరులకు అందిస్తున్న పెన్షన్లలో జరుగుతున్న సాంకేతిక పొరపాటును ప్రభుత్వం దృష్టిలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టవలసిందిగా లెటర్ ద్వారా కోరుతున్నట్లు పేర్కొన్నారు.ముఖ్యంగా సహకార సంఘాలకు సంబంధించిన లబ్ధిదారులు ప్రతి నెలా తమ పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రధాన అంశం ఏమిటంటే, వృద్ధ దంపతుల్లో ఒకరు మరణించినప్పుడు, ఉదాహరణకు భర్త మరణించిన సందర్భంలో, భార్య అర్హత మేరకు తక్షణమే పెన్షన్ పొందే హక్కు కలిగి ఉంటుంది. ప్రస్తుతం భర్త ఓఏపీ (వృద్ధాప్య పెన్షన్) పొందుతున్నట్లయితే, ఎంపిడివో లాగిన్ ద్వారా "Transfer of Pension Option" ద్వారా విడో పెన్షన్ భార్యకు మంజూరు చేయబడుతోంది. అయితే వికలాంగుల పెన్షన్, టాడి టాపర్ పెన్షన్ మరియు ఇతర రకాల పెన్షన్లు (పురుషులు పొందుతున్న ఇతర పెన్షన్లు) ఎంపీడీఓ లాగిన్ ద్వారా బదిలీ కావడం లేదు. దీనివల్ల పెన్షన్ పొందే భర్త మరణించిన మహిళలకు ఏళ్ళు సంవత్సరాలు గడుస్తున్నా కూడా పెన్షన్ మంజూరు కావడం లేదు. కొత్త పెన్షన్లు మంజూరు అయ్యే వరకు, పాత పెన్షన్ బదిలీ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని అలాగే ప్రస్తుతం బదిలీ సదుపాయం కేవలం ఓఏపి పెన్షన్లకే పరిమితమై ఉండటంతో, ఇతర రకాల పెన్షన్లకు బదిలీ జరగడం లేదని లెటర్ లో పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేయబడింది. కాబట్టి భర్త చనిపోయిన మహిళలకు మంజూరు చేయబడే అన్ని రకాల పెన్షన్ల బదిలీ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం గమనించి, అర్హులైన లబ్ధిదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నట్లు లెటర్ లో పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందొద్దు: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**కరీంనగర్ జిల్లా మే27(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ 7వ డివిజన్ పరిధిలోని సదాశివపల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు చీరలు, ఏడుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల్లో అయోమయం సృష్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతాంగాన్ని నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.రైతు పండించిన ప్రతి



గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యానికి సరైన ధర అందేలా కొనుగోలు కేంద్రాలను సమర్థవం తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచిం చారు. రైతుల శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు.ప్రజా ప్రభుత్వంపై



విమర్శలు చేయడం కంటే అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే సూచించారు.నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఉప కమిషనర్ వేణుమాధవ్, కార్పొరేటర్ ఆకుల నందిని, కాంగ్రెస్ నాయకులు బండి మల్లేశం, నందగిరి రవీంద్రచారి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు చుక్కారెడ్డి, రామిడి తిరుపతి, సింగిరెడ్డి మల్లారెడ్డి, ఎస్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాలి వాన భీభత్సంతో కరీంనగర్‌లో నష్టం

**బాధితులను పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్..**

**కరీంనగర్ టౌన్ మే27(పిసిడబ్ల్యూ న్యూస్):** నిన్న రాత్రి కురిసిన గాలి వాన భీభత్సానికి కరీంనగర్ నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోగా, ఇళ్లు దెబ్బతిన్నాయి. బొమ్మకల్ 5వ వార్డులోని వడ్డెర కాలనీలో గాలి వాన తీవ్ర ప్రభావంతో కొన్ని ఇండ్లు కూలిపోయాయి. ఇందులో గండికోట రాజేశ్‌కు చెందిన ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హుటాహుటిన కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్‌లతో కలిసి వడ్డెర కాలనీని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. గండికోట రాజేశ్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించి, కూలిన ఇంటి నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌ల పటిష్టతపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని బండి సంజయ్ వెల్లడించారు. గాలి వానల సమయంలో ప్రజలకు ప్రమాదం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే గాలి వానల కారణంగా వడ్ల కొనుగోలు కేంద్రాల్లో







రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరస్పర విమర్శలకే పరిమితమవుతోందని, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.వడ్ల కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్



చేసిన ఆయన, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. "కేంద్రం వడ్లకు డబ్బులు ఇవ్వడం లేదని చెప్పే ధైర్యం ఉందా?" అంటూ ప్రశ్నించారు. బీజేపీ ఆందోళనల వల్లే కొంతమేర వడ్ల కొనుగోలు జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

# సలేహ్‌నగర్ ఈద్గాహ్‌లో ఈద్ ఏర్పాట్ల పరిశీలన..





**కరీంనగర్ టౌన్ మే 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాబోయే ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని సలేహ్‌నగర్ ఈద్గాహ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ప్రముఖులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అబ్బాస్ సామీ, ఎంఐఎం టౌన్ సెక్రటరీ సయ్యద్ బర్కత్ అలీ, 65వ డివిజన్ కార్పొరేటర్ మొహ్సిన్ మొహియుద్దీన్, ఈద్గాహ్ ముతవల్లి షేక్ సలామ్ కలిసి ఈద్గాహ్ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అలాగే షేక్ సలేహ్ ఎస్ఆర్ డెకరేట్‌కు చెందిన రిజ్వాన్ భాయ్, షాకిర్, సలేహ్‌నగర్ మజ్లిస్ అధ్యక్షుడు యాకూబ్ తదితరులు కూడా పాల్గొన్నారు. ఈద్ నమాజుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పరిశుభ్రత, విద్యుత్, ప్రార్థనా స్థలం వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రాంత ప్రజలు, ముస్లిం సోదరులు శాంతియుతంగా ఈద్ వేడుకలను నిర్వహించుకోవాలని కోరారు.

# "పాఠశాల గంట మోగేలోపే ప్రతి విద్యార్థి చేతిలో పుస్తకాలు గంగాధర మండలంలో 100% పంపిణీ ప్రారంభం"



**గంగాధర మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు యూడైస్G వివరాల ప్రకారం గంగాధర మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ మరియు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈరోజు విజయవంతంగా ప్రారంభించారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మొత్తం:25,708 పాఠ్యపుస్తకాలు 24,092 నోట్‌బుక్స్ 1,845 హైస్కూల్ ప్రోగ్రెస్ కార్డులులి 911 ప్రాథమిక పాఠశాల ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేయబడుతున్నాయి. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి శ్రీ ఏనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ, పాఠశాలల పునఃప్రారంభానికి ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థికి అవసరమైన విద్యా సామగ్రి ఆలస్యం లేకుండా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొత్త విద్యా సంవత్సరానికి సిద్ధంగా ఉండే విధంగా 100% పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ మరియు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన మొదటి రోజునుంచే అవసరమైన అన్ని విద్యా సౌకర్యాలు అందించేందుకు విద్యాశాఖ కట్టుబడి పనిచేస్తోందని శ్రీ ఏనుగు ప్రభాకర్ రావు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుదల మరియు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో మే 11 నుండి జూన్ 13 వరకు "బడిబాట కార్యక్రమం" మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్ర మిశ్రా గారి దూరదృష్టి మార్గదర్శకత్వంలో, అదనపు కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖాధికారి డా. అశ్విని తనాజీ వాకడే మార్గనిర్దేశక పర్యవేక్షణలో నిర్వహించబడుతోంది. ప్రభుత్వ విద్య బలోపేతం మరియు పాఠశాలల సిద్ధతపై వారి నిరంతర కృషి ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు.

# పంట అవశేషాలను కాల్చొద్దు





**భూమి ఆరోగ్యమే రైతు కుటుంబానికి భరోసా**

**నకిలీ విత్తనాల మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

**వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాలబత్తుల**

**ఖమ్మం ప్రతినిధి, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రైతు చెమటతో పుడుతున్న అన్నం సమాజానికి జీవనాధారం. అలాంటి రైతు భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరమని రఘునాథపాలెం మండల వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాలబత్తుల రైతులకు అవగాహన కల్పించారు. రఘునాథపాలెం మండలంలోని మల్లెపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శిరిణ్మయి బాలబత్తుల రైతులతో మమేకమై పంట అవశేషాల కాల్చివేత వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూడ పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రియ పదార్థాలు, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించి నేల సారవంతత తగ్గిపోతుందని తెలిపారు. గడ్డి, కంకి, చెత్త కాల్చివేత వల్ల వాయు కాలుష్యం పెరిగి పర్యావరణ



సమతుల్యత దెబ్బతింటుందని, ప్రజల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. నేలలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో దిగుబడులు పడిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు."రైతు భూమి... అతని ఆస్తి మాత్రమే కాదుడ తరాల భవిష్యత్తు" అని పేర్కొంటూ పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్ని సేంద్రియ ఎరువులుగా మార్చుకోవాలని సూచించారు. జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్ వంటి సహజ వ్యవసాయ విధానాలను అనుసరిస్తే భూమి ఆరోగ్యం మెరుగుపడి పంటల దిగుబడులు పెరుగుతాయని చెప్పారు.అలాగే ప్రస్తుతం మార్కెట్లో నకిలీ విత్తనాల విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని సూచిం చారు. విత్తన సంచిపై లేబుల్, గడువు తేదీ, మొలక శాతం, కంపెనీ వివరాలు పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని తెలిపారు. నకిలీ విత్తనాల వాడకం వల్ల మొలకలు సరిగా రాక రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతులు నేల పరీక్షలు నిర్వహించి భూసారానికి అనుగుణంగా పంటలు, విత్తనాలు ఎంపిక చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ అవగాహన కార్యక్ర మం రైతుల్లో చైతన్యం నింపడమే కాకుండాడ "భూమి ని కాపాడితేనే భవిష్యత్తు పంటలు పండుతాయి" అనే సందేశాన్ని హృదయాలను హత్తుకునేలా రైతులకు స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కలిసి పనిచేస్తే అభివృద్ధి సాధ్యం.. చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం

### అతి త్వరలోనే కరీంనగర్ జగిత్యాల హైవే విస్తరణ పనులకు శ్రీకారం చుట్టబోతున్నా...:కేంద్ర మంత్రి బండి సంజయ్

**గంగాధర మే 25(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు 7 ఏళ్లలో కరీంనగర్ పార్లమెంట్ కు రూ.20 వేల కోట్లు తెచ్చినరోడ్ల నిర్మాణానికే రూ.6 వేల కోట్లకుపైగా వెచ్చించినరవాణా సౌకర్యాలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యంచొప్పదండి మండలం ఆర్నకొండలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడిరూ.50 కోట్లతో ఆర్నకొండ మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులకు కేంద్ర మంత్రి శ్రీకారంకాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంసహా పలువురు కాంగ్రెస్ నేతల హాజరు కలిసి పనిచేస్తే అభివృద్ధి ఏ విధంగా సాధ్యమో చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం. రాజకీయాలను పక్కనపెట్టి నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం కలిసి పనిచేయడంవల్ల చొప్పదండికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే రూ.50 కోట్లతో ఆర్నకొండ మల్యాల డబుల్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించుకోగలగుతున్నాం" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కొద్ది సేపటి క్రితం చొప్పదండి మండలం ఆర్నకొండ విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆర్నకొండ నుండి మల్యాల వరకు 35 కి.మీల మేరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులతో కలిసి కేంద్ర మంత్రి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.కలిసి పనిచేస్తే అభివృద్ధి ఏ విధంగా సాధ్యమో చొప్పదండి నియోజకవర్గమే నిదర్శనం. రాజకీయాలను పక్కనపెట్టి నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం కలిసి పనిచేయడంవల్ల చొప్పదండికి పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయి. అభివృద్ధి చేస్తున్నాం. అందులో భాగంగా చొప్పదండి మండలం అర్నకొండ గ్రామం నుండి గోపాల్ రావు మీదుగా మల్యాల వరకు మొత్తం 35 కి.మీల మేరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించే పనులకు ఈరోజు శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉంది. మొత్తం 50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ రోడ్డును విస్తరించబోతున్నాం. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి CRIF నిధులతో ఈ పనులను చేపడుతున్నాం. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ చుట్టుపక్కల ఉన్న మండలాల వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుంది. అట్లాగే పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుండి కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు ఈ రోడ్డు అత్యంత సమీప మార్గం కాబోతోంది. ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలు చోట్ల కల్వర్టులను కూడా నిర్మించబోతున్నాం. అట్లాగే ఒక చోట మైనర్ బ్రిడ్జి విస్తరణ పనులను కూడా చేపడతాం. ఏడాదిలోపు ఈ రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గడువు విధించాం. ఈ మేరకు కాంట్రాక్టర్ తో ఒప్పందం కుదిరింది. మీకు తెలుసు... ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా, ఏ జిల్లా, ఏ గ్రామమైనా బాగుపడాలంటే... రవాణా సౌకర్యాలు బాగుంటేనే సాధ్యమవుతుంది. అందుకే నేను ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటి వరకు అత్యధిక ప్రాధాన్యత రోడ్ల నిర్మాణానికే ఇచ్చాను. గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి





సడక్ యోజన, సి ఆర్ ఐ ఎఫ్ కార్యక్రమాల నిధులతోపాటు జాతీయ రహదారుల విస్తరణ కోసమే ఎక్కువ నిధులు తీసుకొచ్చిన. గత 7 ఏళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 20 వేల కోట్లకుపైగా కేంద్ర నిధులు తీసుకొస్తే, అందులో రోడ్ల నిర్మాణం కోసం 7 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేసినం. 2 వేల 147 కోట్లు నిధులతో కరీంనగర్-వరంగల్ నేషనల్ హైవే, 578 కోట్ల రూపాయలతో ఎల్కతుర్తి-సిద్దిపేట నేషనల్ హైవే పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేయిస్తున్న. కరీంనగర్, జగిత్యాల ప్రజల చిరకాల వాంఛ గా ఉన్న కరీంనగర్- జగిత్యాల రోడ్డు విస్తరణ పనుల విషయంలో రకరకాల కారణాలవల్ల కొంత జాప్యం జరిగింది. దాదాపు 2 వేల కోట్ల నిధులతో ఈ జాతీయ రహదారి పనులకు అతి త్వరలోనే శ్రీకారం చుట్టబోతున్నాం. సి ఆర్ ఐ ఎఫ్ నిధులను సైతం పెద్ద ఎత్తున కరీంనగర్ పార్లమెంట్ కు తీసుకొచ్చిన. గతంలో తెలంగాణ మొత్తానికి 800 కోట్ల సీఐఆర్ఎఫ్ నిధులు మంజూరైతే... అందులో ఒక్క కరీంనగర్ పార్లమెంట్ కే 291 కోట్లు తీసుకొచ్చి 1341 కిలోమీటర్ల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లను నిర్మించినం. ఇప్పటి వరకు దాదాపు 400 కోట్లకుపైగా సీఐఆర్ఎఫ్ నిధులు తీసుకొచ్చిన. అట్లాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద (వచ్చే జులై 1 నుండి వీబీజీ రామ్ జీ స్కీంగా పేరు మారబోతోంది) ఇప్పటి వరకు దాదాపు 700 కోట్ల రూపాయల నిధులను మన పార్లమెంట్ పరిధిలో ఖర్చు చేసినం. గ్రామీణ సడక్ యోజన పథకం కింద దాదాపు 130 కోట్లు ఖర్చు చేసి రోడ్లు నిర్మించినం. మళ్లీ చెబుతున్నా.... కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఇంకా పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా. గ్రామగ్రామాన, గల్లీగల్లీలో రోడ్లు వేయిస్తా. ప్రజల అభివృద్ధే నా లక్ష్యం. అందుకోసం రాజకీయాలకు అతీతంగా అందరిని కలుపుకుంటూ పార్లమెంట్ అభివృద్ధికి క్రుషి చేస్తా. కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే వివక్ష లేకుండా ఓటేసిన ప్రజల ఆకాంక్ష మేరకు చేయి చేయి కలుపుదాం.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం. కలిసి రావాలని అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులను, నాయకులను కోరుతున్నా.

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- సున్నితంగా మందలించిన కల్లూరు మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్



**కల్లూరు, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ ఛైర్మన్ మోహన్ నాయక్ హెచ్చరించారు. బుధవారం పారిశుద్ధ పనుల పర్యవేక్షణ లో భాగంగా మున్సిపల్ ఛైర్మన్ మోహన్ నాయక్, కల్లూరు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ 15వ వార్డులోని వీధులను డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు ఇంకా మెరుగుపడాల్సి ఉందని నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, పని సరిగా చేయకుంటే 61 సంవత్సరాల పైబడిన వ్యక్తులు నచ్చకుంటే ఇంటికి వెళ్ళొచ్చని మానవతా దృక్పథంతో మేము వారికి అవకాశం కల్పిస్తున్నాము అని పేర్కొన్నారు. కమిషనర్ రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచడానికి శాయశక్తుల ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్మికులకి కమిషనర్ కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డ్ కౌన్సిలర్ యాస నాగమణి శ్రీకాంత్, ధరావత్ రవికుమార్, 15వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## బక్రీద్ ప్రార్థనల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం నేతలు...



**కరీంనగర్ టౌన్ మే 27(పీసీడబ్ల్యూ న్యూస్):** గురువారం (28వ తేదీ) బక్రీద్ పండుగ సందర్భంగా మూడు రోజుల వేడుకలు (28, 29, 30 తేదీలు) జరగనున్న నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం నేతలు శాంతినగర్, షాహలేనగర్ ఈద్గాహ్ మైదానాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. తొలి రోజు ఈద్ నమాజ్ నిర్వహించ నున్న ప్రదేశాల్లో తాగునీరు, విద్యుత్, పార్కింగ్, ప్రథమ చికిత్సతో పాటు ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు మహమ్మద్ తాజుద్దీన్‌తో పాటు నేతలు నేహాల్ అహ్మద్, లాయక్ ఖాద్రి, అబ్దుల్ రహేమాన్, ఎం.డి. చంద్, అమీర్ జమీల్‌ద్దీన్, ఎం.డి. హనీఫ్, షహీనాష్, అజీమ్, జమీల్, సలీం, జమీర్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ స్టడీ సర్కిల్‌లో AI & స్కిల్ డెవలప్‌మెంట్ తరగతులు వాయిదా..




**కరీంనగర్ టౌన్ మే 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని ఐటీ టవర్ సమీపంలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్న AI & స్కిల్ డెవలప్‌మెంట్ తరగతులను వాయిదా వేయాలని ముస్లిం గ్రాడ్యుయేట్ అసోసియేషన్ ప్రతినిధి బృందం రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ హరి కిషన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈద్ ఉల్ అజ్హా ఏర్పాట్లు, తీవ్ర ఎండలు మరియు ఉపవాసాల నేపథ్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మే 28న జరగాల్సిన తరగతులను వాయిదా వేయాలని కోరారు. ప్రతినిధుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన అధికారులు మే 28న నిర్వహించాల్సిన తరగతులను అధికారికంగా వాయిదా వేశారు. ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌తో పాటు తెలంగాణ ప్రభుత్వానికి ముస్లిం గ్రాడ్యుయేట్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ ప్రతినిధి బృందంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ బారి, మహ్మద్ ఇమ్తియాజుద్దీన్, అబ్దుల్ అజీజ్ రషీద్, మహ్మద్ అల్తాఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

## ఖమ్మం ప్రెస్‌క్లబ్‌పై విచారణకు కలెక్టర్ ఆదేశం

### టీడబ్ల్యూజేఎఫ్ ఫిర్యాదుపై స్పందించిన టి.ఎస్.దివాకర డీపీఆర్వోతో కలిసి దర్యాప్తు జరుపుతామని టీడబ్ల్యూజేఎఫ్ నేతలకు డీసీవో గంగాధర్ హామీ




**ఖమ్మం ప్రతినిధి, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా కేంద్ర ప్రెస్ క్లబ్ వేదికగా సాగుతున్న ఆర్థిక, అక్రమ వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. క్లబ్ నిర్వహణలో పారదర్శకత లోపించిందని, నిధుల దుర్వినియోగం జరుగుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూ జేఎఫ్) జిల్లా కమిటీ ఇచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ టి.ఎస్.దివాకర స్పందించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీవో)ని ఆదేశించారు. - **టీడబ్ల్యూజేఎఫ్ నేతలతో డీసీవో సమావేశం..** కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీవో గంగాధర్ బుధవారం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో) గౌస్ పాషాతో కలిసి ఉమ్మడిగా ఈ అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామని జర్నలిస్టు నేతలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. - **ఆదాయ, వ్యయాలపై ఆడిటింగ్ జరపాలి : టీడబ్ల్యూజేఎఫ్** గత పదేళ్లుగా ప్రెస్ క్లబ్‌ను కేవలం రెండు యూనియన్ల నాయకులు తమ గుత్తాధిపత్యంలో ఉంచుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి డీసీవో దృష్టికి తీసుకెళ్లారు. ప్రెస్ మీట్ల ద్వారా వస్తున్న ఆదాయం, క్లబ్ ఖర్చులు, బిల్లులను బహిర్గతం





చేయకుండా అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చివరకు జిల్లా కలెక్టర్‌కే ప్రెస్ క్లబ్ వ్యవహారాలపై ఉన్న అధికారాలేంటంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో (సోషల్ మీడియా) పోస్టులు పెట్టే స్థాయికి తెగబడ్డారని వివరించారు. ప్రెస్ క్లబ్ నిర్వహణ సక్రమంగా సాగాలంటే గత పదేళ్ల ఆర్థిక లావాదేవీలపై ఆడిటింగ్ నిర్వహించడంతో పాటు, యూనియన్ కో రేటుతో ప్రెస్ మీట్ దారులకు రసీదులు ఇవ్వకుండా ఇష్టానుసార వసూళ్లపై విచారణ, నిబంధనల ప్రకారం వెంటనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు. - **టీడబ్ల్యూజేఎఫ్‌లోకి భారీ చేరికలు** ప్రెస్ క్లబ్ అక్రమాలపై టీడబ్ల్యూజేఎఫ్ సాగిస్తున్న పోరాటానికి మద్దతుగా ఆ యూనియన్ లోకి జర్నలిస్టుల చేరికలు భారీగా పెరిగాయి. సీనియర్ జర్నలిస్టులు టీఎస్ చక్రవర్తి, మందడపు మనోహర్, వేర్పుల నాగేశ్వరరావు, కుర్రా సంపత్ చౌదరి, కుంభం రవికుమార్ ల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వివిధ పత్రికలకు చెందిన 40 మందికి పైగా రిపోర్టర్లు బుధవారం ఈ యూనియన్ లో చేరారు. వీరందరికీ యూనియన్ జిల్లా నాయకులు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, సివిఆర్ శ్రీనివాస్, కొత్త రాకేష్, షేక్ జానీ పాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, మధుశ్రీ, దగ్గుపాటి మాధవరావు, టీఎస్ చక్రవర్తి, వేర్పుల నాగేశ్వరరావు, సంపత్ చౌదరి, ఉపేందర్, కుంభం రవికుమార్, కొరకొప్పుల రాంబాబు, హర్షద్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


## 20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డును ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ జిల్లా మే 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలంలోని ఇరుకుల్లా గ్రామంలో 20 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సిసి రోడ్డును బుధవారం రోజున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కురుమ సంఘ పెద్దలు బీరప్ప అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి బండి సంజయ్ ని కోరడంతో, నిధులు మంజూరుకు ఈ సందర్భంగా మంత్రి వారికి హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి కోసం నిధులు కేటాయించి, అండగా నిలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో ఎంపీవో జగన్మోహన్ రెడ్డి, గ్రామ కార్యదర్శి గ్రామ అభినవ్, సర్పంచ్ రమేష్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మండల అధ్యక్షులు మాడిశెట్టి సంతోష్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ రాకేష్, గ్రామ వార్డు మెంబర్లు బిజెపి నాయకులు అనిల్, సంపత్ ,రాము, శ్రీనివాస్ శ్రీధర్ ,కురుమ సంఘ పెద్దలు, మండల నాయకులు ఉప సర్పంచులు శ్రీనివాస్, గోపాల్ రమేష్ ,మండల నాయకులు కమలాకర్ రెడ్డి ,శివరామకృష్ణ ,అమరేందర్ రెడ్డి, సుజన్ శ్రీనివాస్ ,శంకరయ్య, అరవింద్, దేవేందర్ ,నగేష్ ,అనిల్ పాల్గొన్నారు...

# నెహ్రూ ఆశయాలే మాకు స్ఫూర్తి: చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం

**మాజీ ప్రధాని నెహ్రూ ఆలోచన విధానాలతో నేడు సస్యశ్యామలంగా ఉన్న భారత్ - కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుల వైద్యుల అంజన్ కుమార్**




**కరీంనగర్ టౌన్ మే 27(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత తొలి ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో స్మారక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం హాజరై, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని సవరన్ స్ట్రీట్ లో పాత నెహ్రూ విగ్రహం ఉన్న ప్రాంతంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ తో పాటు పలువురు కార్పొరేటర్లు ముఖ్య నాయకులు హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మేడిపల్లి సత్యం, అంజన్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం మొట్టమొదటి ప్రధానమంత్రి అదే విధంగా జాతీయ ఉద్యమంలో మహాత్మా గాంధీతో కలిసి పోరాటం చేసిన జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారికి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర ఉద్యమంలో 10 సంవత్సరాలకు పైగా జైలు జీవితం గడిపి స్వాతంత్ర సముపార్జనలో కీలకపాత్ర వహించిన గొప్ప నాయకుడు జవహర్లాల్ నెహ్రూ, ఒక గొప్ప సంపన్న కుటుంబంలో పుట్టి ఈ దేశం కోసం సర్వం త్యాగం చేసిన మహనీయులు, ఈ దేశం బాగుపడాలని ఉద్యమం చేపట్టి, స్వాతంత్ర్య అనంతరం ఈ దేశం మొట్టమొదటి ప్రధానిగా బాధ్యతలు చేపట్టి నాడు ఈ దేశంలో గుండు సూది కూడా తయారు కాని పరిస్థితుల్లో పంచవర్ష ప్రణాళికలను నెలకొల్పి బాక్రనంగల్ ప్రాజెక్టు, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్ట్ లాంటి ఎన్నో సాగు త్రాగునీటి ప్రాజెక్ట్ లు నిర్మించి, నిర్మాణ దశలోనే కానీ స్వయంగా వాటిని పరిశీలించి పర్యవేక్షించి నేటికీ ఎంతో మన్నిక గల ప్రాజెక్టుగా ఉండడం వారి పని తనానికి నిదర్శనం. ఐఐటీలు, ఎయిమ్స్ ఇలా చెప్పుకుంటూ పోతే జవహర్లాల్ నెహ్రూ ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చేపట్టిన ఆలోచనలు సంస్కరణలు ఎన్నో ఉన్నాయి, వారి ఆశయ సాధన కోసం ఈరోజు కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు శ్రీమతి సోనియా గాంధీ గాని రాహుల్ గాంధీ కానీ నిరంతరం దేశ అభ్యున్నతి కోసం అభివృద్ధి కోసం పోరాడుతున్నారు, కాంగ్రెస్ పార్టీషనులమైన మేమంతా వారి ఆశయ సాధన కోసం వారు చెప్పిన బాటలో నడుస్తూ పార్టీ పటిష్టత కోసం ప్రజా సేవ కోసం కృషి చేస్తున్నాము ఈ సందర్భ జవహర్ లాల్ నెహ్రూని స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులు అర్పించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు ఎండి తాజ్, మడుపు మోహన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్ గౌడ్, ఉప్పుల అంజనీ ప్రసాద్, సరిల్ల ప్రసాద్, వరాల నర్సింగం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అహమ్మద్ అలీ,అబ్దుల్ రహమాన్, వంగల విద్యాసాగర్, సువీన్ యాదవ్, మూల రవీందర్ రెడ్డి, రూపు రెడ్డి శ్రీనివాసరెడ్డి, గడప శ్రీనివాస్, సరిల్ల రతన్ రాజు, నిహాల్, కంకణాల అనిల్, విక్టర్, అమీర్, ఇమ్రాన్, కుంభాల రాజు కుమార్,శిల్ప, లాయికు, సత్తినేని శ్రీకాంత్, మేకల నరసయ్య, గడ్డం శ్రీరామ్,మంద మహేష్,మాజీద్ అలీ ఖాన్, వీరదేవేందర్, ఇమ్రాన్ గని, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలించిన పశువులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలి

**• రాష్ట్ర డీజీపీని కలిసి విజ్ఞప్తి చేసిన గోశాల ఫెడరేషన్ ప్రతినిధులు**




**హైదరాబాద్, మే 27(పిసిడబ్ల్యూ న్యూస్):** బక్రీద్ పండుగ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలోకి అక్రమంగా తరలి ంచిన పశువులను తక్షణమే స్వాధీనంచేసుకుని వాటిని గోశాలలకు తరలించాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ ఐపిఎస్, మహేష్ భగవత్ ఐపిఎస్ లను మహేష్ అగర్వాల్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులను అక్రమంగా తరలించిన వారితో పాటు పశువులను నిల్వచేసిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చెక్ పోస్టుల్లో వాహనాలను వదిలిపెట్టిన పోలీసు అధికారులపై శాఖపరమైన దర్యాప్తు చేపట్టాలని అన్నారు. పోలీసు, జీహెచ్ఎంసీ, గోశాలల ప్రతినిధులతో కూడిన సంయుక్త టాస్క్ఫోర్స్ రాత్రిపూట దాడులు నిర్వహించాలని సూచించారు. విచారణ చేయకుండా వదిలేస్తే హైకోర్టు ధిక్కరణ వాజ్యం దాఖలు చేస్తామని ఆయన హెచ్చరించారు. పశువులను అక్రమంగా తరలించిన 26 వాహనాలకు సంబంధించిన చర్యల నివేదికను 24 గంటల్లోపు అందించాలని కోరారు. కార్యక్రమంలో లవ్ ఫర్ కౌ ట్రస్ట్ ధర్మకర్త రిద్ధిష్ జాగీర్దార్, ప్రాణిమిత్ర సంఘ్ అధ్యక్షుడు జస్రాజ్ శ్రీశ్రీమాల్, కరుణ ఇంటర్నేషనల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ దేష్ లెహ్రా తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు తవ్వారు.. ప్యాచ్ వర్క్ మరిచారు..!




**అంబర్ పేటమే 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫీవర్ ఆసుపత్రి చౌరస్తాలో ప్రధాన రహదారిని తవ్వి మరమ్మతులు చేసిన అధికారులు, తిరిగి ప్యాచ్ వర్క్ చేయడం మరిచారు. దీంతో వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయి కిందపడుతున్నారని సామాజిక కార్యకర్త బంటు సురేందర్ తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కరీంనగర్ కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షునిగా కొరివి అరుణ్ కుమార్‌కు రెండోసారి అవకాశం

**ఢిల్లీలో నియామక పత్రం అందుకున్న అరుణ్ కుమార్ రాహుల్ గాంధీ దిశానిర్దేశం**

**జిల్లా ఎస్సీ విభాగాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతా: కొరివి అరుణ్ కుమార్**

**నియమించిన కవ్వంపల్లి సత్యనారాయణకి సహకరించిన డిసిసి చీఫ్ మేడిపల్లి సత్యంకి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌కి ముఖ్య నేతలకు కృతజ్ఞతలు**





**కరీంనగర్ టౌన్ మే 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షునిగా కొరివి అరుణ్ కుమార్ మరోసారి నియమితులయ్యారు. న్యూఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఈ నియామకం జరిగింది. ఏఐసిసి ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షులు రాజేంద్రపాల్ గౌతమ్, ఎస్సీ విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా కొరివి అరుణ్ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన జిల్లా అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రెండవసారి కరీంనగర్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షునిగా నియమించిన డా. కవ్వంపల్లి సత్యనారాయణకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యంకి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. డా. కవ్వంపల్లి సత్యనారాయణ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కరీంనగర్ జిల్లాలో ఎస్సీ విభాగం అభ్యున్నతికి కృషి చేస్తానని, జిల్లా విభాగాన్ని రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానంలో నిలుపుతానని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో అందరినీ కలుపుకొని జిల్లా స్థాయి కమిటీలు వేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడతానని తెలిపారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్ టౌన్, మే 27 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 24వ డివిజన్‌లో మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, మహిళా సంఘాల అభివృద్ధికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీర దేవేందర్ పటేల్, ఆర్పీలు సుజాత, నూరి, వార్డ్ ఆఫీసర్ ముస్తఫా, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

**దేశవ్యాప్తంగా "గాయ్ రక్షక్ దళ్" ఏర్పాటు**

**'భారత్ మాతాకి జై' అజీముల్లా ఖాన్ నినాదం**

**భారత్ ఐక్యత కోసం ముస్లిం మహనీయుల త్యాగాలు చారిత్రాత్మకం**

**రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ ఆలీ**

**ఖమ్మం ప్రతినిధి, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారతీయ సంస్కృతి, సహజీవన స్ఫూర్తి, మానవతా విలువలకు ప్రతీకగా గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ ఆలీ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోమాత రక్షణ కేవలం ఒక మతానికో, వర్గానికో పరిమితం కాదని, అది భారతీయ సంస్కృతి, జాతీయత, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా "గాయ్ రక్షక్ దళ్" గోవులను గోవధ ఫ్యాక్టరీలకు వెళ్లకుండా ఆపుతామని, ఆపిన గోవులను పోలీస్ స్టేషన్, గోశాలకు తరలించుతామని అన్నారు. గోశాలలోని ప్రతి గోవుకు బీమా సదుపాయం, పశువైద్యులచే ప్రతి 15 రోజులకు వైద్య పరీక్షలు, ప్రతి గోశాలకు 50 ఎకరాల ప్రత్యేక బీడు భూముల కేటాయింపు, గోశాలలోని పశువుల వివరాలు పోలీస్ స్టేషన్లో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. "హమ్ గాయ్ భక్షక్ నహీం గాయ్ రక్షక్ హై" అనే సందేశాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గోవధ ఫ్యాక్టరీలకు ముస్లింల పేర్లు పెట్టి సామాజిక విద్వేషాలను కొందరు మతోన్మాదులు రెచ్చగొట్టడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. అలాంటి ఫ్యాక్టరీలను నిర్వహించే వారు తమ పిల్లల పేర్లతోనే వ్యాపారాలు కొనసాగించాలని కోరారు. సమాజంలో పరస్పర గౌరవం, బాధ్యతా భావం పెరగాలని హితవు పలికారు. మతాల పేర్లతో విభేదాలు సృష్టించడం కన్నా, భారతీయులుగా ఐక్యంగా నిలబడటమే దేశానికి శ్రేయస్కరమని అన్నారు. ఈ సందర్భంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం మహనీయుల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'జాతీయ జెండా' రూపకల్పన చేసింది హైదరాబాద్ కు చెందిన సూరయ్య త్యాబ్జీ అని, "జైహింద్" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన అభిద్ హసన్ సఫ్రాని, "క్విట్ ఇండియా" నినాదాన్ని యూసుఫ్ మెహర్ ఆలీ అందించారని, నేతాజీకి కోటి రూపాయల నగదు తన యావదాస్తి నిచ్చిన అబ్దుల్ హబీబ్ యూసుఫ్ మార్ఫాని, మైసూర్ కు చెందిన హబీబ్ ఉస్మాన్ సేట్ 7వేల కోట్లు స్వతంత్ర సంగ్రామంలో గాంధీజీకి ఇచ్చారని, 'భారతమాత కి జై' అనే నినాదాన్ని 1817లో అజీముల్లా ఖాన్ వంటి మహనీయుల ఇచ్చారని గుర్తు చేశారు. ఇలా 62 వేల మందికి పైగా ముస్లిం వీరులు భారత ఐక్యతకు కృషి చేశారని కొనియాడారు. దేశం అనేది కేవలం భూభాగం కాదని, పరస్పర గౌరవం, సహజీవనం, త్యాగాలతో నిర్మితమైన మహోన్నత భావన అని సయ్యద్ సాదిక్ ఆలీ పేర్కొన్నారు. గోమాత పరిరక్షణతో పాటు భారతీయుల ఐక్యత కోసం అన్ని వర్గాలు కలిసి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో ద్వేషం కన్నా దయ, విభజన కన్నా బంధుత్వం, మతాల మధ్య విభేదాల కన్నా భారతీయత గొప్పదనే సందేశాన్ని ఆయన వ్యాఖ్యలు ప్రతిబింబించాయి. ఈ విలేకరుల సమావేశంలో సయ్యద్ సాదిక్ అలీ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ నజీరుద్దీన్, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్షులు మహమ్మద్ ఖలీమ్, సైదా, సుభాని, నిజాంపేట్ కార్యదర్శి మున్నా భాయ్, హబీబ్, ఖమ్మం పట్టణ టూ టౌన్ అధ్యక్షులు అల్లా బకాష్, ఎండి. షఫీ, ఎండి. గులాం నబి, సారధి నగర్ రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి ఎండి గౌస్, ఎండి. ఖుద్రతుల్లా, ఎండి. హాది, ఎండి. కలీము భాయ్, ఎండి. అమ్జద్ పాషా, అల్లాభక్ష్, ఎస్కే. ఆరిఫ్ న్యాయవాది, తౌసీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# గురుకుల పాఠశాలల్లో ప్రతి సీటు భర్తీ కావాలి

**నిర్లక్ష్యానికి తావులేదు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి**

**సీట్లు భర్తీ కాని పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలు పరిష్కరించాలి**

**ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలి**

**వైద్యులు ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలి**

**పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విద్యార్థులకు సకాలంలో అందించాలి**

**గురుకుల స్వంత భవనాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలి**

**గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**









**ఖమ్మం ప్రతినిధి, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లో బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సంబంధిత అధికారులతో కలిసి గురుకుల, సంక్షేమ వసతి విద్యాసంస్థలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... జిల్లాలో ప్రతి సంవత్సరం గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని రెసిడెన్షియల్ పాఠశాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని వసతి విద్యా సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలోనే అవసరమైన మరమ్మతులు, మౌళిక వసతుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి గురుకుల విద్యాసంస్థకు ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు రెగ్యులర్‌గా పాఠశాలలను సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వైద్యులు కూడా ప్రతి నెల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మరమ్మతులు నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని పాఠశాలలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని తెలిపారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల బిల్లులు అధికంగా క్లియర్ చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్తలు, ఎస్‌ఈ, ఎన్పిడిసిఎల్ శ్రీనివాస్, విద్యా శాఖ సంబంధిత అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాబాసాహెబ్ స్మృతులకు సమున్నత గౌరవం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు**


**కాంగ్రెస్ నాయకుల వినతి**

**ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద**

**ఇనుప మెట్లు, ఫౌంటెన్ ఏర్పాటుకు విజ్ఞప్తి**

**సానుకూలంగా స్పందించి, తక్షణమే**

**అధికారులను ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి**



**ఖమ్మం ప్రతినిధి, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత రాజ్యాంగ నిర్మాత, నిరుపేదల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్మృతులకు సమున్నత గౌరవం కల్పించేందుకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు నడుం బిగించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సెంటర్ వద్ద ప్రతిష్టాత్మకంగా కొలువై ఉన్న అంబేద్కర్ భారీ విగ్రహం వద్ద పుష్ప అలంకరణల కోసం ఇనుప మెట్ల నిర్మాణం చేపట్టాలని, అలాగే ఆ ప్రాంతాన్ని మరింత శోభాయమానంగా మార్చేందుకు ఫౌంటెన్ ఏర్పాటుచేసి, అత్యాధునిక హంగులతో సుందరీకరించాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) మల్లు భట్టి విక్రమార్క కి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఖమ్మంలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఈ విజ్ఞప్తిని అందజేశారు. "బాబాసాహెబ్ విగ్రహం కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేసే ఒక దివ్య సూచిక అని జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి మానవీయ కోణంలో మాట్లాడుతూ... ఖమ్మం నడిబొడ్డున ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ భారీ విగ్రహం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, అది కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రజలందరికీ స్ఫూర్తినిచ్చే ఒక దివ్య కేంద్రమని కొనియాడారు. నిత్యం ఎంతోమంది సామాన్య ప్రజలు, నాయకులు ఇక్కడికి వచ్చి మహనీయునికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తుంటారని గుర్తుచేశారు. అయితే, విగ్రహం ఎత్తుగా ఉండటం వల్ల పుష్ప అలంకరణలు చేయడానికి, పూలమాలలు వేయడానికి భక్తులు, అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, అందుకోసం అక్కడ ఒక పటిష్టమైన ఇనుప మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఆ పరిసర ప్రాంతాన్ని మరింత ప్రశాంతంగా, మనోహరంగా మార్చేందుకు ఫౌంటెన్ నిర్మించి సరికొత్తగా తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మహనీయుని పట్ల ఉన్న గౌరవాన్ని, నాయకుల విజ్ఞప్తిలోని న్యాయాన్ని గమనించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ విషయంపై ఎంతో సానుకూలంగా స్పందించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఇనుప మెట్లు, ఫౌంటెన్ నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. బాబాసాహెబ్ విగ్రహ సుందరీకరణకు తక్షణమే అంగీకారం తెలిపిన డిప్యూటీ సీఎం కి కాంగ్రెస్ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కుక్కల రాజా, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీ షేక్, సొసైటీ డైరెక్టర్ సుందర్ రావు, మెరుగు రత్నరాజు, కొమిరే నాగేశ్వరావు, పి. ప్రసాద్, దారమళ్ళ భాస్కర్, బీఎస్పి నాయకులు రాజశేఖర్, కొర్లకంటి ప్రకాష్ రావు, తమ్మారపు బ్రాహ్మం తదితరులు ఉన్నారు.

# త్యాగం, దైవభక్తిని చాటిచెప్పే పర్వదినం బక్రీద్

**• సొసైటీ అధ్యక్షులు పాలెపు రామారావు**



**కల్లూరు, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, చెన్నూరు సొసైటీ అధ్యక్షులు పాలెపు రామారావు ప్రత్యేక సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి, భక్తి శ్రద్ధలకు, దైవచింతనకు ప్రతీకగా నిలిచే పవిత్ర పండుగ బక్రీద్ అని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముస్లిం సోదరులతో కలిసి పండుగ శుభాకాంక్షలు పంచుకున్న ఆయన, ప్రతి కుటుంబంలో ఆనందం, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మానవతా విలువలను చాటిచెప్పే గొప్ప పర్వదినం బక్రీద్ అని, దేవునిపై అచంచల విశ్వాసం, సమాజం పట్ల త్యాగనిరతి ఈ పండుగ ద్వారా ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఉన్నదానిలో లేనివారికి దానం చేస్తూ అందరి శ్రేయస్సును కోరే ఇస్లాం సంప్రదాయం ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ పవిత్ర పర్వదినం నియోజకవర్గ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని, ప్రజల మధ్య సోదరభావం మరింత బలపడాలని పాలెపు రామారావు ఆకాంక్షించారు.

# షాద్ నగర్ డిపోకు నూతనంగా 8 సిటీ బస్సులు మంజూరు

**• బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**







**షాద్ నగర్, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బస్టాండ్ ఆవరణ లో నూతనంగా షాద్ నగర్ డిపోకు మంజూరైన 8 సిటీ బస్సులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి షాద్ నగర్ నియోజకవర్గంలో ప్రతి పల్లెకు మార్గానికి ఆర్టీసీ సర్వీసులు సేవలు అందేలా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ప్రతి గ్రామానికి ఆర్టిసి బస్సు వెళ్లి వచ్చేలా చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, ఆర్టీసీ డీఎం ఉష ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ రాజు నాయక్, దిలీప్, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, మురళీమోహన్ (అప్పి), కో ఆప్షన్ సభ్యురాలు ఉషారాణి, ముబారక్ అలీ ఖాన్, కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి అంబటి ప్రభాకర్, శ్రీశైలం గౌడ్, చందు నాయక్, మహమ్మద్ ఇబ్రహీం, కరుణాకర్, నాగమణి, మంజుల, మంగ అశోక్, రవితేజ, నీ రటి వాసు, షఫీద్దిన్, జాంగరీ రవి, జగదీష్ మహమూద్ , శంకర్, తుపాకుల శేఖర్, బాబు నాయక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పర్వదినం సోదరభావానికి ప్రతీక



**మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య**



**కల్లూరు, మే 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** త్యాగం, దానగుణాన్ని చాటే మహోన్నత పండుగ బక్రీద్‌బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పవిత్ర పర్వదినం సందర్భంగా ముస్లిం సహోదరులకు తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి, దానగుణానికి ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా ఇస్లాం మతస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పర్వదినమే బక్రీద్ అని పేర్కొన్నారు. ధనిక, పేద అనే తారతమ్యాలు లేకుండా ప్రజల మధ్య శాంతి, సహనం, సౌభ్రాతృత్వాన్ని ఈ పండుగ పెంపొందిస్తుందని అన్నారు. ఈ పవిత్ర దినాన ప్రతి మనిషి హృదయంలో ధార్మికత, దైవచింతన విరాజిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణలో బక్రీద్ సందర్భంగా ప్రజల మధ్య సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని కోరుకున్నారు. ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దైవాన్ని ప్రార్థించినట్లు సండ్ర వెంకట వీరయ్య తెలిపారు.




# సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల

ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.

# కమల్‌హాసన్‌ను కలిసిన భాగ్యశ్రీ భోర్సే

కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుందని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.





# ట్రోలర్స్‌ను పెద్దగా పట్టించుకోను

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర బృందం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉండగా, ఇటీవల జరిగిన కొన్ని ఈవెంట్లలో రామ్ చరణ్ మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని సందర్భాల్లో పేర్లు మర్చిపోవడం, బెంగళూరు ఈవెంట్‌లో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న జగపతి బాబు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై జరుగుతున్న ట్రోలింగ్‌తో పాటు తనపై గతంలో వచ్చిన విమర్శలపైనా స్పందించారు. ట్రోలింగ్ చేసే వాళ్ల గురించి నేను పెద్దగా పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవ్వరినైనా కిందకి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు. చరణ్ ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడు, ఎన్ని గాయాలు అయ్యాయి, ఎంత శ్రమించాడు అనే విషయాలను పక్కనపెట్టి చిన్న విషయాలను పట్టుకుని పెద్దదిగా చేస్తున్నారని అన్నారు. అలాగే ఒక పెద్ద సినిమా ప్రమోషన్స్ సమయంలో హీరోలపై ఎంత ఒత్తిడి ఉంటుందో కూడా ఆయన వివరించారు. ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఎన్నో బాధ్యతలు ఒకేసారి ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా చాలా సందర్భాల్లో మర్చిపోతాను. అలాంటివాటిని పట్టుకుని ట్రోల్ చేయడం సరికాదు అని వ్యాఖ్యానించారు. ఇక తనపై గతంలో వచ్చిన ట్రోలింగ్‌పై కూడా ఆయన స్పందించారు. ఒక సీన్ కోసం నేను 70 లేదా 80 టేక్స్ తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. కానీ అందులో ఎలాంటి నిజం లేదు. ఎక్కువలో ఎక్కువ మూడు టేక్స్ తీసుకుని ఉంటాను. పూర్తిగా ఫేక్ సమాచారంతో ట్రోలింగ్ చేశారని స్పష్టం చేశారు.

## చిరంజీవి జోక్యంతో 'పర్సంటేజీ' నిర్ణయం వాయిదా..

# రెంటల్ విధానంలోనే 'పెద్ది' సినిమా!



మెగాస్టార్ చిరంజీవితో ఎగ్జిబిటర్ల తాజా సమావేశం అనంతరం వివాదం ఓ కొలిక్కి వచ్చింది. తెలంగాణ ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య గత కొంతకాలంగా పర్సంటేజీ వివాదం కొనసాగుతోన్న విషయం తెలిసిందే. పెద్ది చిత్రం నుంచి పర్సంటేజీ విధానం అమలు కావాల్సిందేనని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిరంజీవితో తెలంగాణ ఎగ్జిబిటర్లు ఈరోజు సమావేశమయ్యారు. ఆయన జోక్యంతో పర్సంటేజీ విధానం నిర్ణయం వాయిదాపడింది.దీంతో జూన్ 4వ తేదీన విడుదల కానున్న పెద్ది చిత్రంను రెంటల్ విధానంలోనే ప్రదర్శించాలని ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. జూన్ 30వ తేదీ తర్వాత విడుదలయ్యే చిత్రాలకు పర్సంటేజీ విధానం వర్తింపజేస్తామని వారు తెలిపారు. తెలంగాణ ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఫిల్మ్ ఛాంబర్ కమిటీ నివేదిక మేరకు ముందుకు సాగాలని సూచించారు.




# ప్రతి భాషను గౌరవిస్తా

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్‌తో పాటు ఇతర పరిశ్రమల్లోనూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'ఇ-55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది.భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల... తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను. నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది.పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.

# చిరంజీవిపై అసత్య ప్రచారం....

## యూట్యూబ్ ఛానెల్ పై కేసు నమోదు



మెగాస్టార్ చిరంజీవి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా , ఆయన ఆరోగ్యం తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానెల్ పై పోలీసుల కేసు నమోదు చేశారు. చిరంజీవి ఆరోగ్యంపై అసత్యం ప్రచారం చేయడంతో మార్ఫింగ్ వీడియోను పోలీసులు గుర్తించారు. ఆ వీడియోలను ఓ యూట్యూబ్ ఛానెల్ విస్తృతంగా ప్రచారం చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. యూట్యూబ్ ఛానెల్ అప్ లోడ్ చేసిన వివాదాస్పద కంటెంట్ కు సంబంధించిన వీడియో లింకులు, స్క్రీన్ షాట్లను న్యాయవాది రామకృష్ణ మిర్యాల పోలీసులకు అందజేశారు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై ముఖ్యంగా ఆరోగ్యంపై తప్పుడు వార్తలు ప్రసారం చేయడం చట్టవిరుద్ధమని ఫిర్యాదులో న్యాయవాది వివరించారు. పోలీసులు యూట్యూబ్ ఛానెల్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# 'పుష్ప' అవకాశం నాకూ షాకే..

## ఆ పాత్ర నా జీవితాన్నే మార్చేసింది: సునీల్

కమెడియన్‌గా కెరీర్ ప్రారంభించి, హీరోగా, విలన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సునీల్, 'పుష్ప' చిత్రంలో మంగళం శ్రీను పాత్రకు ఎంపికవడం తనకూ ఓ షాక్ అని అన్నారు. ఈ పాత్ర తన జీవితాన్నే మార్చేసిందని, అన్ని భాషల్లోనూ అవకాశాలు తెచ్చిపెట్టిందని ఆయన తెలిపారు.తన తాజా మలయాళ చిత్రం 'కాటాలన్' తెలుగు వెర్షన్ ప్రమోషన్లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సునీల్ ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'పుష్ప'లో విలన్‌గా సుకుమార్ మిమ్మల్ని ఎలా ఊహించుకున్నారని అడగ్గా.. "లాక్‌డౌన్ సమయంలో నేను కామెడీ పాత్రలు కాకుండా వేరేవి చేస్తున్నానని సుకుమార్‌కు చెప్పాను. రెండు రోజులకే ఆయన ఫోన్ చేసి 'పుష్ప'లో పూర్తిస్థాయి విలన్ పాత్ర ఉంది, కానీ కామెడీ చేయకూడదు, శరీరం కూడా కదపకుండా హావభావాలు పలికించాలని చెప్పారు," అని సునీల్ వివరించారు.లుక్ టెస్ట్ కోసం పంపిన కాస్ట్యూమ్స్‌తో రకరకాలుగా ఫోటోలు తీసి పంపించానని, అవి నచ్చడంతో ఆ పాత్రకు ఎంపికయ్యానని గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరిగినన్ని రోజులు పాత్ర కోసం నుదుటిపై షేవ్ చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు.సునీల్ 'మారి' అనే కీలక పాత్రలో నటించిన 'కాటాలన్' చిత్రం మే 28న తెలుగులో విడుదల కానుంది. ఏనుగు దంతాల అక్రమ రవాణా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి పాల్ జార్జ్ దర్శకుడు. ఇందులో ఆంటోనీ వర్గీస్, కబీర్ దుహాన్ సింగ్, దుషారా విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.